

మెరిసిన కీర్తి సురేష్

హనుమకొండ నక్కలగుట్టలో జోస్ ఆలుక్కాస్ నూతన షోరూం ప్రారంభంలో సినీనటి కీర్తి సురేష్ మెరిసింది. - 8లో ▸



పారదర్శకంగా పీహెచ్‌డీ అడ్మిషన్లు - 8లో ▸

కేయూలోని వివిధ విభాగాల్లో 2021-22లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని ఇన్‌చార్జ్ వీసీ కరుణ ఆదేశించారు.

గరిష్టం/కనిష్టం
$31^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఈజిప్టు దేశస్తుల సందడి



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని శనివారం ఈజిప్టు దేశస్తులు సందర్శించి సందడి చేశారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ తీసుకుంటున్న ఈజిప్టు దేశస్తులు శిక్షణలో భాగంగా రామప్ప ఆలయాన్ని సందర్శించినట్లు ఎంసీహెచ్‌ఆర్‌డీ అధికారులు వడ్ల శ్రీనివాస్, రవి తెలిపారు. రామప్ప రామలింగేశ్వరస్వామిని వారు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ ద్వారా తెలుసుకొని రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్ టెంపుల్ అంటూ కొనియాడారు.

జావెలిన్‌త్రోలో కరిష్మాకు తృతీయ బహుమతి



ఏటూరునాగారం: మెదక్ జిల్లాలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన పదో తెలంగాణ రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ పోటీలలో ములుగు జిల్లా ఏటూరునాగా రం మండల కేంద్రానికి చెందిన ఎండి.కరిష్మా జావెలిన్ త్రోలో తృతీయ బహుమతి గెలుపొందారని కోచ్ పర్వతాల కుమారస్వామి శని వారం తెలిపారు. ఈ మేరకు కరిష్మాను ము లుగు జిల్లా అథ్లెటిక్స్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, నాగరాజులు అభినందించారు.

పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వొద్దు



వెంకటాపురం(ఎం): తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వకుండా దూరంగా ఉంచాలని ఎస్‌ఎస్‌ఏ జిల్లా కోఆర్డినేటర్ సాంబయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరేంట్స్ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే పేరేంట్స్ కమిటీ సమావేశానికి తల్లిదండ్రులు తప్పకుండా హాజరు కావాలన్నారు. పిల్లల చదువులు, స్థితిగతులు, విద్యావిధానం ఎలా ఉందో తెలుసుకోవడానికి తల్లిదండ్రులు పాఠశాలలను రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం రాధిక, పీఎస్ హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు జనగాం బాబురావు, కిరణ్‌కుమార్, సంధ్యారాణి, రమేష్, రాజయ్య, లావణ్య, స్వప్న, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

'కాటమయ్య కిట్లు' సద్వినియోగం చేసుకోవాలి



ములుగు రూరల్: గీత కార్మికులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కాటమయ్య కిట్లను సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జంగాలపల్లిలో గీత కార్మికులకు ఎక్సైజ్ సీఐ సుధీర్ ఆధ్వర్యంలో కాటమయ్య కిట్ల శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీత కార్మికులకు కిట్లను రెండు విడతల్లో అందిస్తామన్నారు. అనంతరం గౌడ సంఘం జేఏసీ నాయకుడు భిక్షపతి మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలకు గీత కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గీత కార్మికులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

గోవిందరావుపేట: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, ప్రతీ యువత యాంటీ డ్రగ్ సోల్జర్‌గా పని చేయాలని డీఎస్పీ ఎన్. రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో పస్రా ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ రవీందర్ హాజరై మాట్లాడారు. యువకులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలి పారు. అందుకే యువతను చైతన్య పరిచేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పస్రా సీఐ గద్ద రవీందర్, పీఈటీలు సురేందర్, ఆదినారాయణ పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు

పిల్లలు, పెద్దలు తేడా లేకుండా వెంటబడి కరుస్తున్న శునకాలు

- ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న బాధితులు
- జిల్లా వ్యాప్తంగా 17రోజుల్లో 189కేసులు



రోడ్డుపై గుంపుగా తిరుగుతున్న కుక్కలు

ఏటూరునాగారం: జిల్లాలోని ప్రజలు కుక్కల స్వైర విహారంతో నానా అవస్థలు పడుతున్నారు. బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. పిల్లలు, పెద్దలని తేడా లేకుండా వెంటబడి గాయపర్చి ఆస్పత్రుల పాలు చేస్తున్నాయి. ఏ వీధిలో చూసినా అవే దర్శనమిస్తున్నాయి. జిల్లాలోని 9 మండలాలు 174 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిల్లో 17రోజుల వ్యవధిలోనే 189 కేసులు నమోదు అయ్యాయి.

కుక్కకాటుకు గురైతే వ్యాక్సిన్ తప్పనిసరి

కుక్క కాటు గురైన వ్యక్తి కొన్ని రోజుల పాటు పత్యం చేయాలి. వ్యాక్సిన్ విధిగా వాడాల్సి ఉంటుంది. ఒక వేళ పిచ్చిలేచిన కుక్కకరిస్తే ఆ కుక్కను కనిపెట్టుకుంటూ ఉండాల్సి ఉంటుంది. ఆ కుక్కకు ఏమైనా జరిగితే ఆ మనిషి కూడా చనిపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే వీధి కుక్కలకు ఎలాంటి వ్యాక్సిన్ వేయించకపోవడం వల్ల ఎర్రి, గజ్జి, పిచ్చి లేచి కనిపించిన వారినల్లా కరుస్తాయి. కుక్క కరిచిన బాధితులు కరిచిన రోజు ఒకటి వ్యాక్సిన్, ఆ తర్వాత మూడో రోజు, ఏడో రోజు, 14వ రోజు, 28వ రోజు వ్యాక్సిన్ క్రమ తప్పకుండా వాడాల్సి ఉంటుంది.

ప్రత్యేక అడ్డాలు

చికెన్, మటన్ షాపులు, చేపల మార్కెట్లు వీధి కుక్కలకు అడ్డగా మారాయి. అక్కడే స్థావరాన్ని ఏర్పాటు చేసుకొని విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. మాంసానికి వచ్చే వారిపై ఎగబడి కరిచి వారి వద్ద ఉన్న వస్తువులను సైతం నోటకరిచి తీసుకుపోతున్నాయి. వీటిని నివారించాలని అనేక చోట్ల గ్రామ పంచాయతీలకు వినతులు వెల్లువెత్తుతున్నాయి. కానీ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఈ ఫొటోలో ఉన్న రుషికాకు ఆరేళ్లు. వాజేడు మండలం పేరూరు గ్రామం. అల్లారుముద్దుగా ఇంటి బయట ఆడుకుంటుండగా కుక్కదాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో లబోదిబోమంటూ తల్లిదండ్రుల వద్దకు పరుగెత్తింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగు చోట్ల కరిచింది. దీంతో ఆ చిన్నారిని ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురావడంతో వ్యాక్సిన్ వేశారు. ప్రస్తుతం ఆ అమ్మాయి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది.

జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసులు

మండలాలు	కేసులు
ఏటూరునాగారం	34
మంగపేట	20
వాజేడు	18
కన్నాయిగూడెం	16
ఎస్ఎస్ తాడ్వాయి	19
గోవిందరావుపేట	20
ములుగు	23
వెంకటాపురం(కె)	20
వెంకటాపురం(ఎం)	19

కిరాణంషాపునకు పోయి వస్తుంటే..



కిరాణం షాపునకు వెళ్లి సామాను కొనుగోలు చేసుకొని ఇంటికి బయలుదేరాను. అక్కడ కుక్కలున్నాయి. వాటిని చూస్తూ వస్తుండగానే నాపై రెండు కుక్కలు దాడి చేసి గాయపరిచి నా దగ్గర ఉన్న కవర్‌ను లాక్కెళ్లాయి. వాటిని చూసి వణుకుపుట్టింది.

- కుదురుపాక రాము, పేరూరు

వ్యాక్సిన్ విధిగా వాడాలి



కుక్క కరిచిన వెంటనే గాయాన్ని శుభ్రంగా నీటితో కడగాలి. ఎలాంటి మందులు చల్లరాదు. ఆస్పత్రికి వచ్చి చెప్పిన రోజులలో క్రమం తప్పకుండా వ్యాక్సిన్ తీసుకోవాలి. కుక్క కరిచిన చోట ఎలాంటి మందులు రాయవద్దు. డాక్టర్‌లు ఇచ్చిన సూచనలను విధిగా పాటించాలి. కుక్కకు గజ్జి, పిచ్చి ఉంటే ఇంకా వేరే వ్యాక్సిన్ వాడాల్సి ఉంటుంది.

- సురేష్ కుమార్, వైద్యులు, ఏటూరునాగారం

ఓపీ సేవలు బంద్



జిల్లాకేంద్రంలో ఏరియా ఆస్పత్రి ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

- వైద్య విద్యార్థినిపై అత్యాచార, హత్య ఘటనను నిరసిస్తూ..
- ములుగులో వైద్యుల ధర్నా ఏటూరునాగారంలో నిరసన

ములుగు/ఏటూరునాగారం: పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలోని మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచార, హత్యా ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ వైద్య సేవలు బంద్ అయ్యాయి. అత్యవసర సేవలకు మాత్రమే వైద్యం అందించారు. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి వైద్యులు విమెన్ ఆర్ బీ రెస్పెక్టెడ్ అని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఏరియా ఆస్పత్రి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్ మాట్లాడుతూ ఇక ముందు వైద్య విద్యార్థులపై ఇలాంటి భయానక దాడులు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రతీఏడాది చదువుకుంటున్న చోట పదుల సంఖ్యలో వైద్య విద్యార్థినులు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ లాల్, వైద్యులు ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఏటూరునాగారంలోని సామాజిక ఆస్పత్రిలో వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వైద్య సేవలను నిలిపివేశారు. ఈ సందర్భంగా వైద్యుడు సురేష్ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణం పోసేది వైద్యులన్నారు. అలాంటి వారికి రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ నిరసనలో వైద్యులు కల్యాణ్, హెడ్ నర్సు నాగదేవి, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

ములుగు రూరల్: విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ములుగు విద్యుత్ శాఖ ఏఈ సాయికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం 9.30 నుంచి 12.30గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఇవ్వాలి

ములుగు రూరల్: పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఇవ్వాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు అన్నారు. ఈ మేరకు శనివారం అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన కరాటే, మార్షల్ ఆర్ట్స్ నిపుణులతో శిక్షణ అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో సమాజంలో విద్యార్థినులు, మహిళలపై అత్యాచారాలు, అరాచకాలను అరికట్టేందుకు వీలుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, రంజిత్, భాను, మహేష్, విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో జాతీయ జెండాను ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేవైఎం నాయకులు ఎస్పీ శబరీశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ములుగు బస్టాండ్ సమీపంలో లేదా గాంధీ చౌక్ వద్ద గాని జాతీయ జెండాను ఏర్పాటు చేసి ప్రతిరోజూ దేశ భక్తి గీతాన్ని ప్రతీ పౌరుడు ఆలపించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, రంజిత్, భాను తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఓటరుగా నమోదు చేసుకోవాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

ములుగు: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి పి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. అక్టోబర్ 29న ముసాయిదా, ఓటర్ జాబితా విడుదల, నవంబర్ 28వరకు అభ్యంతరాల స్వీకరణ, ఓటరు నమోదు కార్యక్రమంపై రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలన్నారు. ఓటరు జాబితా 2025పై శనివారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి జిల్లా నుంచి కలెక్టర్ దివాకర హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ 1 జనవరి 2025 ప్రామాణికంగా ఓటర్ జాబితా సవరణ కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలన్నారు. జిల్లాలో ఓటరు జాబితా నమోదు ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆగస్టు 20నుంచి అక్టోబర్ 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించి అక్టోబర్ 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయాలన్నారు. 28 నవంబర్ 2024 వరకు సదరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. రెండు శనివారాలు, ఆదివారాలు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. 6 జనవరి 2025న తుది ఓటరు జాబితా రూపొందించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ డివిజన్ అధికారి కె.సత్య పాల్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ దివాకర

హేమాచలక్షేత్రంలో భక్తుల సందడి



మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచలక్షేత్రంలోని స్వయంభు లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. శ్రావణమాసం సందర్భంగా వివిధ సుదూర ప్రాంతాల నుంచి కార్లు, ఆటోలు, ప్రై వేట్ బస్సులు తదితర వాహనాల్లో గుట్టపైకి చేరుకున్న భక్తులు ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్య స్నానాలు ఆచరించి హేమాచల కొండపై ఉన్న ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు పవన్‌కుమార్ ఆచార్యులు ఈశ్వర్‌చంద్ శర్మ స్వామివారికి నువ్వుల నూనెతో తిల తైలాభిషేకం పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మానవ శరీరాన్ని పోలి ఉండే స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు వివరించిన స్వామివారి విశిష్టత, ఆలయ చరిత్రను ఎంతో శ్రద్ధతో ఆలకించి పరవశించారు.



లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అర్హులకు పోడు పట్టాలు

వీసీలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

ములుగు: అర్హులకు పోడు పట్టాలు అందించేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ మేరకు శనివారం మంత్రి కొండా సురేఖ హైదరాబాదులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్కతో కలిసి పోడు భూములపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి జిల్లా నుంచి కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అటవీ భూముల విస్తీర్ణం, ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టం జారీ చేసిన పోడు భూముల పట్టాలు, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు వంటి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉన్నతాధికారులకు వివరించారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టం ప్రకారం 13డిసెంబర్ 2005 నాటికి సాగు చేస్తున్న గిరిజనులు, మూడు తరాలపాటు సాగు చేసిన గిరిజనేతరులకు పోడు భూముల పట్టాల పంపిణీకి అర్హులని వివరించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2,30,735 మంది అర్హులను గుర్తించి వారికి 6,69,676 ఎకరాల అటవీ భూమి పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు పంపిణీ చేసిన పోడు పట్టాల వివరాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో సాగవుతున్న అటవీ భూముల వివరాలతో కూడిన నివేదిక అటవీ, గిరిజన, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా రూపొందించి సమర్పించాలని మంత్రి ఆదేశించారు. పోడు భూముల పట్టాల కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. అర్హత ఉన్న వారికి పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ భూముల సంరక్షణకు అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజనులకు అటవీశాఖ వ్యతిరేకం కాదనే విధంగా పనిచేయాలన్నారు. కొత్తగా అడవుల నరికివేత జరగకుండా అటవీశాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ భూములు, చెట్ల నరికివేత వల్ల కలిగే నష్టాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అటవీ భూముల్లో స్మగ్లింగ్ జరగకుండా నిఘా వేసి ఉంచాలన్నారు. పెండింగ్ పోడు భూముల పట్టా దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని సూచించారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్ట ప్రకారం అర్హులందరికీ పట్టాలు అందజేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీడీ పోచం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వీసీకి హాజరైన కలెక్టర్ దివాకర, పీఓ చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్



జోరుగా రాఖీల కొనుగోళ్లు

- షాపుల వద్ద మహిళల సందడి

ఏటూరునాగారం: రేపు రాఖీ పౌర్ణమి. ఈ సందర్భంగా షాపుల వద్ద శనివారం మహిళలు జోరుగా కొనుగోలు చేశారు. దీంతో మండల కేంద్రంలోని రాఖీ షాపులు సందడిగా కనిపించాయి. అదే విధంగా రాఖీ పౌర్ణమి సందర్భంగా నేడు మండల కేంద్రంలోని రామాలయంలో రక్షాబంధన్ ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచారక్ విభాగ్ విగ్నేష్ తెలిపారు. రక్షాబంధన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

నిల్వ నీటిని పారబోయాలి

డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య

వాజేడు: ప్రతీ మూడు రోజులకు ఒకసారి నిల్వ నీటిని పారబోయాలని జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య అన్నారు. మండల పరిధిలోని కొంగాల గ్రామంలో శనివారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటా సర్వే నిర్వహించారు. ప్రతీ ఇంటి పరిసరాలను పరిశీలించిన ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ నీటిని నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఇంటి పరిసరాల్లో చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. దోమ తెరలను వాడాలని, అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్యుల సూచనలు, సలహాలను పాటించాలని తెలిపారు. దోమల లార్వా పెరుగుదలను గమనించిన ఆయన థీమోపాస్, పైరిత్రిన్ మందులను గ్రామంలోని 30 ఇళ్లల్లో చల్లించారు. గ్రామంలోని 20 మంది నుంచి రక్త నమూనాలకు సంబంధించిన శాంపిల్స్ సేకరించి జిల్లాలోని తెలంగాణ డయాగ్న స్టిక్స్ సెంటర్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు. అంతకు ముందు గ్రామంలోని పాఠశాలను పరిశీలించిన అప్పయ్య విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. జ్వరంతో చనిపోయిన మొడెం లక్ష్మి ఇంటిని పరిశీలించి భర్త ప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్యాధికారి వెంట వైద్యులు మధుకర్, యోషిత, ఇన్‌చార్జ్ ఏఎమ్‌వో దుర్గారావు, నర్సింగరావు, కోటిరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ములుగు రూరల్: ములుగు జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కులం, మతం పేరుతో రాజకీయాలు చేసే పార్టీలకు కాలం చెల్లిందన్నారు. దేశంలో 10సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేసే విధంగా వ్యవహరిస్తుందన్నారు. కమ్యూనిస్టులు, లౌకిక శక్తులతోనే ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమన్నారు. ఈ నెల 22నుంచి 24వరకు హనుమకొండ హరిత హోటల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంపాల రవీందర్, ప్రసాద్, అమ్జద్‌పాషా, రాజు, కొమురయ్య, సారయ్య, అయిలయ్య, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసరావు

డేవిడ్ ఇజ్రాయిల్‌తో దీపక్ గార్గ్ భేటీ



హసన్‌పర్తి : ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విశ్వ విద్యాలయ గ్లోబల్ ఎడ్యుకేషన్ స్ట్రాటజీ డైరెక్టర్ డేవిడ్ ఇజ్రాయిల్‌తో ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ శుక్రవారం భేటీ అయ్యారు. డేవిడ్ ఇజ్రాయిల్ ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో పర్యటించగా ఆయనను ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఎస్సార్ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ అడ్వాన్స్‌డ్ ఆనర్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం ప్రారంభించేందుకు భాగస్వామ్యం గురించి డేవిడ్ ఇజ్రాయిల్‌తో దీపక్ గార్గ్ చర్చించారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లు పారదర్శకంగా చేపట్టాలి

- కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ



వీడియో కాన్ఫరెన్స్‌లో రిజిస్ట్రార్ మల్లారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, బీఓఎస్‌లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో సోషల్‌సైన్స్, సైన్స్, ఫార్మసీ, కామర్స్, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్, లా, తదితర విభాగాల్లో 2021–2022లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికాగా లెఫ్ట్‌ఓవర్ వేకెన్సీల్లో మెరిట్ జాబితా ప్రకారమే పీహెచ్‌డీ అడ్మిషన్లను పారదర్శకంగా చేపట్టాలని కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్యాంపస్‌లోని పరిపాలన భవనంలో అకడమిక్ కమిటీ హాల్‌లో అన్ని విభాగాల డీన్లు, విభాగాల అధిపతులు, బీఓఎస్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు.గతంలో నిర్వహించిన ప్రవేశపరీక్షలోని మెరిట్‌జాబితా ప్రకారంగానే పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ పారదర్శకంగా పూర్తిచేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తిచేయాలని, పొరపాట్లు చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి, వివిధ విభాగాల డీన్లు టి. మనోహర్, ఎ. జ్యోతి, ఎస్. రాంనాథ్ కిషన్, జి. సమ్మయ్య, సదానందం, జి.హనుమంతు, ఎం.శ్రీనివాస్, అకడమిక్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోలశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భవితకు నవోదయం..

- పల్లెల్లోని ప్రతిభావంతులకు నాణ్యమైన విద్య
- జవహర్ నవోదయ విద్యాలయం
- ఆరో తరగతికి దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబర్ 16 చివరి గడువు

ఖిలా వరంగల్ : ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య.. ఉత్తమ విలువలు.. దేశభక్తి.. క్రీడలు.. నైపుణ్యం.. ఇలా అన్ని అంశాల్లో నాణ్యమైన విద్యనందిస్తోంది ఖిలావరంగల్ మండలం మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయం. ఈ నేపథ్యంలో ఈ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ..

ఎనిమిదేళ్లుగా దరఖాస్తులను నవోదయ వెబ్‌సైట్ www.navodaya.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. మొత్తం 80 సీట్లకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి గతేడాది 50 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించ సెప్టెంబర్ 16న చివరి తేదీగా ప్రకటించారు. 2025 జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పూర్ణిమ ప్రకటించారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

దరఖాస్తు సమయంలో చాలా మంది తప్పులు చేస్తుంటారు. విద్యార్థి గ్రామం, ఏ నవోదయ విద్యాలయ పరిధిలో బ్లాక్‌ల పరిధిలోకి వస్తుంది అనేది వెబ్ సైట్‌లో పొందుపరిచిన వివరాలతో మొదట పరిశీలించుకోవాలి. అది తెలియకుండా నచ్చిన 15 బ్లాక్‌ను ఎంపిక చేసుకుంటే సీట్లు కోల్పోవాల్సి వస్తుంది. కొంత మంది విద్యార్థులు గ్రామీణ, పట్టణ విషయంలో చాలా మంది తప్పులు చేస్తున్నారు. సీట్లు పొందినా గ్రామీణ ప్రాంతమనే సర్టిఫికెట్‌ను తీసుకురాలేకపోవడంతో సీట్లు కోల్పోవాల్సి వస్తోంది.



మామునూరులోని నవోదయ విద్యాలయం

చక్కటి గ్రంథాలయం ఏర్పాటు

ఆరో తరగతి నుంచే కంప్యూటర్ విద్యాబోధన. విద్యాలయ ప్రాంగణంలో అధునాతన వసతులతో కూడిన సుమారు 50 వేలకు పైగా పుస్తకాలు కలిగిన చక్కటి గ్రంథాలయం ఏర్పాటు చేశారు. డిజిటల్ తరగతి గదులతో పాటు విద్యార్థులకు ప్రత్యేక ట్యాబ్‌లు ఇస్తారు.

గర్ల్స్ ఎంపవర్‌మెంట్ కింద విజ్ఞానజ్యోతి పథకంలో భాగంగా తొమ్మిది నుంచి 12వ తరగతి అమ్మాయిలకు నీట్, ఐఐటీ–జేఈఈ కోచింగ్‌కు రూ.8వేలు ఇస్తారు. 12వ తరగతికి చెందిన 40 మంది విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదిపాటు ఉపకార వేతనం అందజేస్తారు. పదో విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు పోత్సహించేందుకు సైన్స్ కిట్ ఇస్తారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా, ఆన్‌లైన్ ద్వారా ఉచిత ఐఐటీ కోచింగ్ తరగతులు నిర్వహిస్తారు.

సీట్ల కేటాయింపు ఇలా..

విద్యాలయంలో 80 సీట్లు ఉన్నాయి. వీటిలో 60 (75శాతం) గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం పట్టణ ప్రాంతవాసులకు కేటాయిస్తారు, వీటిలో 15 శాతం ఎస్సీ, 7.5 శాతం ఎస్టీ, 3 శాతం దివ్యాంగులు, బాలికలకు 1/3 వంతు రిజర్వేషన్‌ను సీట్ల కేటాయింపులో అమలు చేస్తారు. ఎంట్రన్స్ టెస్ట్ మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హులు ఎవరంటే..

3, 4, 5 తరగతులు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. ఐదో తరగతి తప్పనిసరిగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో చదవాలి. అభ్యర్థులు 01-05-2013 నుంచి 31-07-2015 మధ్య జన్మించి ఉండాలి. అభ్యర్థి ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. లేకుంటే తహసీల్దార్ కార్యాలయం నుంచి నివాస ధ్రువీకరణ పత్రం ఉండాలి.

సులభంగా సీటు పొందా..



నేను ప్రభుత్వ పాఠశాలలో చదివా. ఈసీటు నాకు వస్తుందా..? అని అపనమ్మకం ఉండేది. ఆరు నెలల పాటు క్రమశిక్షణ, పట్టుదలతో చదవడంతో సీటు సులభంగా పొందా. పాఠ్యాంశాలను బట్టీపట్టకుండా ప్రణాళిక ప్రకారం చదివితే విజయం సాధించొచ్చు.

– శ్రీవర్ధన్, ఆరో తరగతి విద్యార్థి

ఎంపిక పారదర్శకం



ప్రతి విద్యార్థికి ముందు క్రమశిక్షణ అలవాటు చేస్తాం. అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం. ఒత్తిడికి గురి కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ ఏడాది అత్యధికంగా దరఖాస్తులు వచ్చేలా విస్తృత ప్రచారం చేస్తున్నాం. ప్రతిభను నమ్ముకుని కష్టపడి చదివితే ఉత్తీర్ణత సాధించొచ్చు.

– పూర్ణిమ, ప్రిన్సిపాల్ నవోదయ విద్యాలయం మామునూరు

హ్యాండ్లూమ్ కాలేజీ ఏర్పాటు శుభపరిణామం

- చేనేత కార్మికుల పిల్లలకు ఉజ్వల భవిష్యత్
- రాష్ట్ర చేనేత జౌళిశాఖ ఓఎస్‌డీ హిమజకుమార్



మాట్లాడుతున్న రాష్ట్ర చేనేత జౌళిశాఖ ఓఎస్‌డీ హిమజకుమార్

వరంగల్: తెలంగాణ రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) కాలేజీ ఏర్పాటు కావడం శుభపరిణామని రాష్ట్ర చేనేత జౌళిశాఖ ఓఎస్‌డీ హిమజకుమార్ అన్నారు. శనివారం కొత్తవాడలోని పద్మశాలీ ఫంక్షన్ హాల్‌లో కాలేజీ ఏర్పాటుపై చేనేత కార్మికుల కుటుంబాలకు అవగాహన కల్పించారు. ఈఏడాది ప్రారంభం కానున్న చేనేత, టెక్స్‌టైల్స్ డిప్లొమా కోర్సుల్లో చేరే విద్యార్థులు 10తరగతి లేదా సమాన మైన పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 2024 జూలై 1నాటికి బీసీ, జనరల్ కేటగిరీ విద్యార్థులు గరిష్ట వయోపరిమితి 23 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25 ఏళ్లు ఉండాలన్నారు. దరఖాస్తులు ఈనెల 7 నుంచి 31వ తేదీ వరకు స్వీకరిస్తారని, మూడేళ్ల కోర్సులో ఆరు సెమిస్టర్లు ఉంటాయన్నారు. ఈ కాలేజీలోని ప్రతి విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2500 ఉపకార వేతనం ఇస్తుందని తెలిపారు. ఏడాదికి రూ.4,050 మాత్రమే ఫీజు చెల్లించాలన్నారు. హైదరాబాద్ నాంపల్లి సమీపంలోని శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో వసతి సదుపాయాలు కల్పిస్తారని తెలిపారు. వసతికయ్యే ఖర్చులను విద్యార్థి తల్లిదండ్రులు భరించాల్సి ఉంటుందన్నారు. అనంతరం పలువురు పద్మశాలీ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో వరంగల్ జిల్లాలో టెక్స్‌టైల్స్ ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తే చేనేత కార్మికుల పిల్లలు ఈ కోర్సులో శిక్షణ పొంది కాకతీయ టెక్స్‌టైల్స్ పార్కులో ఉద్యోగాలు వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు తెలిపారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొచ్చి హైదరాబాద్‌లో ఈవిద్యా సంవత్సరంలోనే 60 సీట్లతో చేనేత, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులను ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు రాఘవరావు మాట్లాడుతూ పూర్తి చేసిన దరఖాస్తులు కమిషనర్ చేనేత, జౌళి శాఖ కార్యాలయం, చేనేత భవన్, మూడో అంతస్తు నాంపల్లి హైదరాబాద్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా గాని స్వయంగా అందించాలన్నారు. కార్యక్రమంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్లు బొట్టు వెంకటేశ్వర్లు, బిజ్జా వెంకటేశ్వర్లు, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఎలగం రవిరాజు, చేనేత సమాఖ్య అధ్యక్షుడు పంతగాని శ్రీనివాస్, మంత్రి లింగమూర్తి, సహకార సంఘాల అధ్యక్షులు ఎలగం పెద్ద భద్రయ్య, చిన్న భద్రయ్య, అడిగొప్పుల సంపత్, కూరపాటి సంపత్, పిట్టా రాములు, పరికిపండ్ల రమేశ్,ఎలగం సాంబయ్య, మాచబత్తుల కుమారస్వామి, శామంతుల శంకర లింగం, దానం రాజయ్య, లింగబత్తిని పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఒక టీచర్.. ఇద్దరే విద్యార్థులు

- ఉన్న ఇద్దరూ గైర్హాజరు..
- సాయంత్రం వరకు ఒంటరిగా కూర్చున్న ఉపాధ్యాయుడు
- పాతతండా జీపీ ప్రభుత్వ పాఠశాలలో ఘటన



పాతతండాజీపీ ప్రాథమిక పాఠశాల



పాఠశాలలో ఒంటరిగా కూర్చున్న టీచర్

కేసముద్రం: ఓ ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరే విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ఒక టీచర్ ఉన్నారు. అయితే ఉన్న ఇద్దరు విద్యార్థులు కూడా పాఠశాలకు గైర్హాజరు కావడంతో పాఠం బోధించడానికి ఎవరూ లేకపోవడంతో ఆ టీచర్ సాయంత్రం వరకు ఒంటరిగా కూర్చున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం పాతతండాజీపీలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పాత తండా జీపీలోని ప్రాథమిక పాఠశాలలో గతేడాది 8 మంది విద్యార్థులున్నారు. ఈ క్రమంలో ఇనుగుర్తి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల నుంచి టీచర్ కోటేశ్వర్‌రావు ఈ పాఠశాలకు బదిలీ అయ్యాడు. తీరా స్కూల్‌కు వచ్చి చూస్తే విద్యార్థులు ఎవరూ లేరు. దీంతో తండాలోని ఇంటింటికీ వెళ్లి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపమని కోరుతూ వచ్చాడు. అప్పటికే తండాలోని విద్యార్థులు ప్రైవేట్ స్కూల్‌కు వెళ్తున్నారు. చివరకు ఇద్దరు పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు అంగీకరించారు. అయితే ఆ ఇద్దరిలో ఓ విద్యార్థి స్కూల్‌కు రావడం లేదు. వస్తున్న ఒక్క విద్యార్థికి టీచర్ చదువు చెబుతున్నాడు. ఈక్రమంలో ఉన్న ఆ ఒక్క విద్యార్థికి జ్వరం రావడంతో శనివారం స్కూల్‌కు హాజరుకాలేదు. దీంతో ఆ టీచర్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒంటరిగా కూర్చున్నాడు.

తాళం వేసి ఉన్న షాపులే టార్గెట్..

- వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి

వరంగల్ క్రైం: రాత్రి సమయంలో తాళం వేసి ఉన్న షాపుల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్ట్ చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పీఎస్ పరిధిలోని హంటర్‌రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో హనుమకొండ దీన్‌దయాల్ నగర్‌కు చెందిన భూతరాజు సందీప్ అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా రాత్రి సమయంలో తాళం వేసి ఉన్న షాపుల్లో వరుస చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నాడు. భూతరాజు సందీప్ సాయికేర్ ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నాడు. వచ్చిన వేతనం జల్సాలకు సరిపోకపోవడంతో నగరంలో రాత్రి సమయంలో పలు షాపుల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. ఆయా షాపుల తాళాలు పగులగొట్టి రూ.4.50 లక్షలు అపహరించాడు. దీంతో పాటు హైదరాబాద్, హనుమకొండలో మూడు బైకులు, మూడు సెల్‌ఫోన్లు చోరీ చేశాడు. ఈ ఘటనలపై గత సంవత్సరం జైలుకెళ్లొచ్చినా తన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోగా తిరిగి చోరీలకు పాల్పడుతున్నాడు. భూతరాజు సందీప్ మొత్తం 21 చోరీలకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభకనబర్చిన ఏఎస్సై పాపయ్య, కానిస్టేబుళ్లు అలీ, ప్రభాకర్‌ను ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి అభినందించారు.

డెంగీ పీడితులకు మెరుగైన వైద్యసేవలు

- వైద్యారోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్
- ఎంజీఎం సందర్శన



ఎంజీఎం ఆస్పత్రిలో వార్డును పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్

ఎంజీఎం : డెంగీ జ్వర పీడితులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యారోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఎంజీఎంలోని పలు వార్డులను సందర్శించి డెంగీ జ్వర పీడితులకు అందిస్తున్న చికిత్సలను పరిశీలించారు. అనంతరం ఎంజీఎం సూపరింటెండెంట్ మురళితో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ మరణాలు సంభవించకుండా డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎంజీఎం వైద్యులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ జ్వర పీడితులకు వైద్యసేవలందించాలన్నారు. ఎంజీఎం బ్లడ్‌బ్యాంక్‌లోని రక్తనిధి నిల్వలు ప్లేట్లెట్స్ బాధితులకు సరిపోయేలా అందించేందుకు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించి వరంగల్ జిల్లాలో డెంగీ, మలేరియా వ్యాధి తీవ్రతను తెలుసుకుని పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు, ఎంజీఎం ఆర్‌ఎంఓ మురళి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వైద్యారోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్

వరంగల్: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అదనపు డైరెక్టర్ అమర్‌సింగ్ శనివారం వరంగల్ కలెక్టర్ సత్యశారదను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వరంగల్ జిల్లాలో డెంగీ, చికెన్ గున్యా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారించేందుకు తీసుకుంటున్న జాగ్రత్తలు, తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు చర్చించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాలరావు, ప్రోగ్రాం ఆఫీసర్ మోహన్‌సింగ్, జోనల్ మలేరియా ఆఫీసర్ సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జోస్ ఆలుక్కాస్ షోరూం ప్రారంభం



జోస్ ఆలుక్కాస్ షోరూంను ప్రారంభిస్తున్న సినీనటి కీర్తి సురేశ్, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, మేయర్ సుధారాణి

- సినీనటి కీర్తి సురేశ్ సందడి



ఆభరణాలు ప్రదర్శిస్తున్న సినీనటి కీర్తి సురేశ్

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలో ఆభరణాల రిటైల్ రంగలో అగ్రగామి సంస్థ జోస్ ఆలుక్కాస్ షో రూం ప్రారంభమైంది. శనివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ప్రముఖ సినీనటి కీర్తి సురేశ్ ప్రారంభించారు. రెండు ఫ్లోర్లలో ఏర్పాటు చేసిన షో రూంలో బంగారు, వజ్రాభరణాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కీర్తి సురేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అతిథిగా హాజరైన సినీ నటి కీర్తి సురేశ్ అభిమానులకు అభివాదం చేసి మాట్లాడుతూ చారిత్రక, వారసత్వ, పర్యాటక ప్రాంతం వరంగల్‌కు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. జోస్ ఆలుక్కాస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు వరీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్‌ఆలుక్కా మాట్లాడుతూ హనుమకొండ నక్కలగుట్టలో కొత్తగా ఆభరణాల షోరూం ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు రూ.60వేల బంగారు, వజ్రాభరణాలు కొనుగోలు చేసిన కస్టమర్లకు ప్రోత్సాహకంగా బంగారు నాణెం ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. అదనంగా వజ్రాలపై 20 శాతం తగ్గింపు, ప్లాటినం ఆభరణాలపై 7 శాతం తగ్గింపు పొందొచ్చన్నారు. జోస్ ఆలుక్కాస్ షో రూంలో చేసిన ప్రతీ కొనుగోలుపై ఒక బహుమతి ఇస్తున్నట్లు తెలిపారు. జోస్ ఆలుక్కాస్ 60వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆరు ఎంజీ ఆస్టర్ కార్లు, గృహోపకరణాలు, బంగారు నాణెలతో సహా రూ.6కోట్ల విలువైన బహుమతులు ప్రకటించినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సును తప్పించబోయి..

- రోడ్డు పక్కకు ఒరిగిన గ్రానైట్ లారీ
- కిందపడిన రాళ్లు..తప్పిన ప్రమాదం
- ఊపిరిపీల్చుకున్న ప్రయాణికులు



గుంతలో పడిన రాళ్లు

కురవి: ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి మూలమలుపు వద్ద గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న లారీ చెట్టుకొమ్మకు తగిలి అదుపు తప్పి రోడ్డు పక్కకు ఒరిగింది. ఆర్టీసీ బస్సుపై పడే రాళ్లు రోడ్డు పక్కన పడడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన శనివారం ఉదయం కురవి మండల కేంద్రం శివారు ఖమ్మం వెళ్లే 365/ఏ జాతీయ రహదారిపై జరిగింది. గూడూరు మండలం తీగలవేణిలోని ఓ క్వారీ నుంచి గ్రానైట్ లోడ్‌తో ఓ లారీ ఖమ్మం వెళ్తోంది. ఈ క్రమంలో కురవి శివారులోని గ్యాస్‌గోదాం సమీపంలో మూలమలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా ఖమ్మం నుంచి ఆర్టీసీ బస్సు వచ్చింది. దీంతో గ్రానైట్‌లోడ్ లారీని నడుపుతున్న డ్రైవర్ ఒక్కసారిగా బస్సును తప్పించబోయే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న చెట్టు కొమ్మ రాళ్లకు తగిలింది. లోడ్‌తో ఉన్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో ఒరిగింది. అందులోని రాళ్లు గుంతలో పడ్డాయి. దీంతో బస్సుకు పెనుప్రమాదం తప్పింది. ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

కొమ్మ విరిగింది.. గూడు చెదిరింది..

- నాలుగు పిట్ట పిల్లలు మృతి



చనిపోయిన నాలుగు పక్షి పిల్లలు(సర్కిలోనివి)

కురవి మండల కేంద్రం శివారులోని గ్యాస్ గోదాం సమీపంలో మూలమలుపు వద్ద గ్రానైట్ లారీపై ఉన్న రాళ్లు పెద్ద చెట్టు కొమ్మను తాకడంతో కొమ్మ విరిగిపోయింది. దీంతో చెట్టు కొమ్మ తొర్రలో పక్షి పెట్టిన గూడు చెదిరింది. అందులో ఉన్న కళ్లు సైతం తెరవని నాలుగుపక్షి పిల్లలు రోడ్డుపై పడిపోయి చనిపోయాయి. ఈ దృశ్యం రోడ్డు ప్రమాదాన్ని చూసేందుకు వచ్చిన జనాల మనస్సులు కలచివేసింది.

నేటి జాతీయ స్థాయి సమావేశానికి బాలిరెడ్డి



అల్లం బాలిరెడ్డి

గీసుకొండ: మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ మరియపురం మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డికి రాజీవ్‌గాంధీ 80వ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ స్థాయి రౌండ్ టేబుల్ జూమ్ మీటింగ్‌లో పాల్గొనాలని ఆహ్వానం అందింది. రాష్ట్రం నుంచి గ్రామపాలనపై సమావేశంలో పాల్గొనేది బాలిరెడ్డి ఒక్కరే కావడం విశేషం. గడిచిన ఐదేళ్లలో గ్రామాన్ని ప్రజలు, మహిళా పొదుపు సంఘాల సహకారంతో జాతీయ స్థాయిలో ఉన్నతంగా తీర్చిదిద్దిన తీరును ప్రశంసిస్తూ ఆయనను ఈ సమావేశానికి ఆహ్వానించారు. అకాడమీ ఆఫ్ గ్రాస్‌రూట్స్ స్టడీస్ అండ్ రీసెర్చ్ ఆఫ్ ఇండియా(తిరుపతి) ఆధ్వర్యంలో 'రాజీవ్ గాంధీ విజన్ అండ్ మిషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఇన్ ద ట్వంటీ ఫస్ట్ సెంచరీ' అనే అంశంపై నిర్వహిస్తున్న సమావేశంలో బాలిరెడ్డితో పాటు గ్రామానికి చెందిన పొదుపు సంఘాల మహిళలు ఈ జూమ్ సమావేశంలో పాల్గొననున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే జూమ్ మీటింగ్ కోసం మరియపురంలో ఏర్పాట్లు చేశారు. కాగా, బాలిరెడ్డి సర్పంచ్‌గా విధులు నిర్వహించిన ఐదేళ్ల కాలంలో 8 జాతీయ స్థాయి సదస్సుల్లో పాల్గొన్నారు.

తండ్రి హత్య కేసులో కూతురు, అల్లుడి అరెస్ట్

భూపాలపల్లి అర్బన్: ఆస్తి కోసం తండ్రిని చంపిన ఘటనలో కూతురు, అల్లుడితోపాటు మరో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. భూపాలపల్లి పట్టణంలోని కారల్ మార్క్స్ కాలనీకి చెందిన బొమ్మన లక్ష్మారెడ్డి(66) తన ఆస్తిని తన పెద్ద బిడ్డ పేరున రాయించి ఇస్తానని పలుమార్లు చెప్పడంతో చిన్న కూతురు మహేశ్వరి, ఆమె భర్త చంపాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన తమ ఇంటికి తీసుకెళ్లి అత్యాయత్నానికి పాల్పడగా లక్ష్మారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటనపై పెద్దకూతురు రాజేశ్వరీ ఆమె భర్త జగన్‌మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు చిన్న కూతురు మహేశ్వరి ఆమె భర్తతోపాటు ముత్తయ్య, కవ్వాల మహేశ్, శనిగరపు రాజు, లింగాల కృష్ణను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ నరేశ్ కుమార్ శనివారం తెలిపారు.